


# మోసపోయిన మోసం కథ

బొల్లిముంత నాగేశ్వరరావు

అది రావుల్లంక గ్రామం. కృష్ణానది ప్రక్కనే ప్రవహిస్తుంది. బస్సులాంటి ఆధునికసౌకర్యాలకు ఇంకా దూరంగానే బ్రతుకుతుంది. ఎండాకాల మయితే రేవుకు అవతల దాకా సిటీ బస్సు ఒకటే వస్తుంది.

ఖాళీ డబ్బా అన్నింటినీ మూట గట్టి రోడ్డు మీదుగా ఈడ్చుకువస్తుంటే ఎంత మోత వస్తుందో ఆ బస్సు నడిచేప్పుడు అంత మోత వస్తుంది. అది వూరుకు దూరంగా వచ్చి ఆగినా, రావుల్లంక జనానికి వేరే 'హారన్' శబ్దాలక్కర్లేదు. పట్నం పని ఉన్న వాళ్ళు గబగబా నడిచి వెళ్ళి దాన్ని అందుకుంటారు.

పంచాయతీవారు వూరుకు మధ్యగా ఉన్న వేప చెట్టు చుట్టూ రాతిగోడను కట్టి మూడు గజాల వెడల్పులో గుండ్రని దెమ్మెగా గచ్చు చేశారు. పనీ పాటా లేని వాళ్ళకి పగటి కాలక్షేపమంతా అక్కడే. ఏదో ఒక దినపత్రిక మాత్రం పంచాయతీ సర్పంచ్ పేరున ఆ అరుగుల దగ్గరకే వస్తుంది. రోజులో చీకటి పడ్డాక పంచాయితీ గుమాస్తా నలిగి తుక్కుగా మారిన ఆ పేపరును మరలా భద్రంగా మడతలు పెట్టుకుని సర్పంచ్‌గారికి అందిస్తాడు.

అరుగుల చెట్టుకు కాస్తంత దూరంలో చిన్న పెంకుటింట్లో పంచాయతీవారి సమష్టి రేడియో కేంద్రం ఉంది. పని వేళల బోర్డు ప్రకారం పంచాయతీ గుమస్తాయే రేడియో పనిచేసేట్టు, ఆగిపోయేట్టు పని చేసి వెళ్ళిపోతాడు!

ఎండకు నీడ, కూర్చోవటానికి అరుగులు, కాస్తంత వార్తల పత్రిక, కొద్దిగా రేడియో కబుర్లు, అందులోనే అప్పుడప్పుడు సినిమా పాటలు ఆ అరుగుల చెట్టు దగ్గరే దొరకటంతో ఏమీ తోచని వాళ్ళంతా

అక్కడికే చేరుతుంటారు. అందులో సుబ్బారావు ఒకడు.

సుబ్బారావుకి మూడెకరాల దాకా పొలం ఉంది. రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. ఏడాది క్రితమే తండ్రి ఉన్న నలుగురు కొడుకులకూ తలా మూడు ఎకరాలూ పంచి వేరు కాపురాలు పెట్టించాడు. ఆఖరు వాడు సుబ్బారావు! అటూ ఇటూ గాని చదువు! ఉన్న దానితోనే తృప్తిపడి వ్యవసాయం చేపట్టాడు.

ఆ ఆరుగుల చెట్టు దగ్గరే మీసాల పోతురాజు దగ్గర నుండి అమెరికా వారి 'నాసా' కేంద్రం వదిలే రాకెట్ల వరకు చర్చ సాగుతుంది.

ఆరోజు సరిగ్గా అదే చర్చ సాగింది.

మీసాల పోతురాజు వూరు మీదకు ఒక చాలెంజిని వదిలాడు.

'దెయ్యాల్ని చూపిస్తాను— పందెం కాసేవాళ్ళు కాసుకోండి' అన్నాడు.

పేపరు చదువుతున్న సుబ్బారావుకి పరమేశు ఆ కబురు చెప్పాడు. ఇంకా అక్కడ చాలా మంది జనం ఉన్నారు. మీసాల పోతు రాజంటే అందరికీ భయమే. పరమేశు అన్నదానికి ఎవరూ పలుకలేదు!

పోతురాజుకి ఆ లంకల్లో మంచి గిరాకీ ఉంది. పిల్లాడికి జ్వరమొచ్చినా, గేదె పాలీయక పోయినా, హిస్టీరియా తెరలు వచ్చి ఏ స్త్రీ వెర్రిగా అరిచినా పోతురాజు ప్రత్యక్ష మవుతాడు.

అర్థంకాని కేకలు పెట్టి ఆవేశంగా అరుస్తాడు. తాయెత్తులంటూ ఏవేవో తయారుచేసి మనుషుల కైతే మెడల్లోనూ, గేదెలకైతే కొమ్ములకీ కడు తుంటాడు. తాయెత్తుకు రెండు రూపాయల దాకా తీసుకుంటాడు. కొబ్బరికాయలనీ, కోళ్ళను కొయ్య టానికనీ ఇంకా ఖర్చు చేయిస్తుంటాడు.

నాసా కేంద్రం వారి రాకెట్ విషయాలు చదువు తున్న సుబ్బారావుకి మీసాల పోతురాజు చాలెంజి నవ్వులాటగా తోచింది.

పరమేశు ముఖంలోకి చూసి అన్నాడు:

'ఇంకా దెయ్యాలా! ఎవరికన్నా ముసలమ్మలకు చెప్పమను. ఇది రాకెట్ల యుగంరా. మొన్నటి దాకా చంద్రుడు దేవుడన్నారా? ఇప్పుడది గ్రహమని తేలిందా? సూర్యుడు దేవుడన్నారా? అది అగ్ని గోళమని చెపుతున్నారా? అసలు దెయ్యాలు లేవని పెద్ద పెద్ద వాళ్లే చెపుతున్నారా? పందెం కడతాను. నాకు చూపించమను.'

ఇన్నాళ్ళకు మీసాల పోతురాజుకు ఎదురునాట్లాడే ఒక మనిషి తయారయ్యాడన్నట్టుగా జనం ఆసక్తిగా సుబ్బారావు వంక చూశారు.

సుబ్బారావుకు ఆవేశ మొచ్చింది. పోతురాజుచేసే అన్యాయాలను వరుసగా ఏకరువు పెట్టటం మొద లెట్టాడు. జనాన్ని రోగాలొస్తే డాక్టర్ల దగ్గ రకు పోనీయకుండా దెయ్యాలనీ, దేవర్లనీ కల్ల బొల్లి కబుర్లు చెప్పి డబ్బులు కాజేస్తున్నాడనీ, ఫలితంగా రోగాలు ముదిరి జనం అన్యాయమవు తున్నారనీ, దీన్ని సహించకూడదనీ, ప్రతి రోగానికి ఒక కారణముంటుందనీ, కారణం తెలుసుకుని చికిత్స చేస్తే నయమవుతుందనీ, గుండెలు మార్చే ఆపరేషన్లు జరుగుతున్న ఈ రోజుల్లో దెయ్యాల వల్ల జబ్బు లొస్తాయని నమ్మటం ఎంత మూర్ఖ త్వం మరొకటి ఉండదనీ ఇంకా ఏమేమిటో చెప్పింది చెప్పకుండా అరగంట అదే పనిగా చెప్పాడు. జనాని కంతా నిజమే ననిపించింది. జనం తన మాటలకు విలువనిచ్చి శ్రద్ధగా విన టంతో సుబ్బారావుకు మరింత ఉత్సాహం వచ్చింది.

పోతురాజు సవాలును ఎదుర్కొని ఆచరణా త్మకంగా ఒక సత్యాన్ని ప్రజలకు నిరూపించి చూపాలనుకున్నాడు. వెంటనే జేబులో ఉన్న రెండు వందల రూపాయల్ని తీసి అక్కడే కూర్చున్న శ్రీరాములు గారి చేతిలో పెట్టాడు.

'ఇదే పందెం—ఇంకా కావాలన్నా కాస్తాను. నాకు దెయ్యాల్ని చూపించమనండి. పోతురాజు ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్తాను. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను.'

ఎటుచూసినా హైస్కూలు చదువుకు అయిదు మైళ్ళు దూరంలో ఉన్న ఆ గ్రామంలో పెద్దగా చదువుకున్న వాళ్ళు లేరు. సుబ్బారావు చూపెట్టిన ఆ ధైర్యానికి అక్కడి వారంతా పెద్దగా ఆశ్చర్య పోయారు.

శ్రీరాములికి కూడా ఈ పందెంలో సుబ్బా రావును నిలబెట్టి పోతురాజు దెయ్యాల సంగతేమిటో తేల్చుకోవాలనిపించింది. వెంటనే పరమేశును పోతు రాజు దగ్గరకు పంపించాడు.

కాస్సేపట్లో పోతురాజు వచ్చాడు.

మోకాళ్ళ కింద వరకూ వేసుకున్న వదులు లాల్చీ, రంగులు వదిలిన ఎర్రటి పంచె, పైన రంగు రంగుల దుప్పటి లాంటి ఉత్తరీయమూ, చేతిలో మెలికలు తిరిగిన నల్లటికర్రా. కిర్రుచెప్పులూ— వూరులోనికి బయులుదేరితే పోతురాజు ధరించే ప్రత్యే కతలు! మనిషి ఎత్తుగా లావుగా ఉంటాడు. ముక్కు బారుగా ఉంటుంది. క్రింద అంత కంటే బారుగా మీసా లుంటాయి. రూపాయి ప్రమాణంలో ఎప్పుడూ కుంకుమ బొట్టు నొసలు మీద ఉంటుంది. నెత్తి మీద జుట్టు పెద్దగా లేదు. సగం వరకూ రాలిపోయి, మిగతా సగం పలచ బడింది. అయినా ఉన్న జుట్టునే వెనుక బారుగా పెంచి మెలికలు తిప్పాడు. వచ్చి అక్కడ కాస్సేపు ముసి ముసి నవ్వులు నవ్వాడు.

'ఏమండీ, శ్రీరాములుగారూ!' పలకరించి అన్నాడు. తరవాత పోతురాజు కళ్ళు ఎర్రగా మారాయి.

'ఎవరు పందెం కాసేది!' గద్దించినట్టు అడిగాడు. ఈలోగా ఆ ఆరుగుల చెట్టు దగ్గరకు ఇంకా జనం పోగయ్యారు.

'నేనే!' సుబ్బారావు తొణక్కుండా అన్నాడు.

'పందెం అయిదొందల రూపాయలు.' పోతురాజు గంభీరంగా అన్నాడు.

'వెయ్యి రూపాయలయినా సిద్ధమే!' సుబ్బారావు అంతే గంభీరంగా అన్నాడు.

వెంటనే పోతురాజు జేబులోంచి అయిదు వందలూ తీసి శ్రీరాములు చేతిలో పెట్టాడు. సుబ్బారావు చకచకా ఇంటికి పోయి మిగతా మూడు వందలూ తెచ్చి శ్రీరాములు చేతిలో పెట్టాడు.

పందెం అమావాస్య రోజు నిర్ణయించబడింది. ఆరోజు పగలు పన్నెండు గంటలకు పోతురాజు ఆరుగుల చెట్టు దగ్గరికి వస్తాడు. పందెం వివరాలు తెలియజేస్తాడు. మరునాటి తెల్లవారు జామున కొంత విషయం తేలుతుంది. తరవాత వారం రోజులు గడిచేసరికి దెయ్యాన్ని చూపించటం జరుగుతుంది. తను గనుక చూపించలేకపోతే అయిదొందలు వదులు కుంటాడు. సుబ్బారావు చూశానని అంగీకరిస్తే అయిదొందలూ తనకు ముట్టాలి —

మీసాల పోతురాజు చెప్పాడు.

సుబ్బారావు దేనికైనా సిద్ధమే అన్నాడు.

అమావాస్య ఎప్పుడొస్తుందని ఎవరో జనంలో నుండి అడిగారు. శ్రీరాములు కేలండర్ తెప్పించి చూశాడు. అయిదు రోజుల్లో అమావాస్య ఉంది!

• • •

ఈ అయిదు రోజులూ సుబ్బారావును ఇంటి దగ్గర అన్నలూ, తండ్రీ నానా విధాలుగా చెప్పి పందెం నుండి విరమించేట్టు చెయ్యాలని ప్రయత్నించారు. పోతురాజంటే మాటలు కాదనీ, ఎందరికో 'చేత బడులు' చేశాడనీ, దెయ్యా లతడు పిలిస్తే పలుకు తాయనీ, అనవసరంగా తలపడవద్దనీ చిలక్కి చెప్పినట్టు మధ్య కూర్చోబెట్టుకుని మరీ మరీ చెప్పారు.

ఎవరు ఎలా చెప్పినా సుబ్బారావు వినలేదు. రోజు రోజుకీ మొండికెత్తాడు. దెయ్యం ఎలా ఉంటుందో తను తప్పక చూడాల్సిందే నన్నాడు. ఇంకా ఇప్పుడు దెయ్యాలంటే ఎవరు నమ్ముతారని కొట్టి పారేశాడు. మన దేశంలో చదువుకున్న వాళ్ళు తక్కువ కాబట్టే పోతురాజు ఆటలు ఇంకా

---

## సీతాకోకచిలుక

సీతాకోక చిలుక కెంత
ప్రీతి పూలతేనెలంటె
తిప్పు తిప్పు మంటు ప్రతి
పువ్వుపైన వాలుతుంది!

విరులలోన తేనె ఉన్న
విషయమెవరు తెల్పినారో?
చుక్కయినా విడువకుండ
జుర్రుతుంది బొజ్జనిండ!

కొంటె పిల్ల లెవరైనా
వెంట తరుముకొస్తుంటే
చేతికందినట్లె అంది
చివ్వున పైకెగురుతుంది.

వింత వింత రంగులున్న
విరుల వెనుక ఒదుగుతుంది.
సీతాకోక చిలుక ఎంత
చిలిపితనం దాచుకుంది.

అంది అందకుండ బలే
పొందికగా మెలుగుతుంది.
దాని తెలివి చూసి పాప
తబ్బిబ్బయి పోతున్నది!

- జి. ప్రభావతి

---

పోసుతున్నాయనీ, ఇంకా ఎంత కాలమో అది సాగదనీ అన్నలతో ఎదురు వాదించాడు.

ఇక లాభం లేదని సుబ్బారావు అన్నలు ఒక నిర్ణయానికొచ్చారు. తమ్ముడికి తెలీకుండా పోతురాజు దగ్గరికి పోయారు. పెద్ద దెయ్యాన్ని చూపించవద్దనీ, ఏదో పిల్ల దెయ్యాన్ని ఒకదాన్ని చూపించి వదిలెయ్యమనీ, ఏ విధమైన హానీ కలగకుండా ఉండేట్టు చెయ్యమనీ, అలాచేస్తే ఇంకో ఆయిదొందలు తాము కూడా ఇస్తామనీ, పిల్లవాడితో పంతం పోవద్దనీ పదే పదే బ్రతిమలాడు కున్నారు. పోతురాజు చిన్నగా నవ్వాడు.

'సరే, సాధ్యమయినంతలో కనపడకుండానే చేస్తాను. ఇక్కడ తిరిగే దెయ్యాలన్నింటికీ చెప్పాలి. రేపు 'కాపాలి' పూజ చెయ్యాలి. ఖర్చు ఏభై రూపాయల దాకా అవుతుంది' అంటూ పెదవి విరిచాడు.

సుబ్బారావు పెద్దన్న వెంటనే జేబులో ఉన్న ఏభై రూపాయలు తీసి పోతురాజు చేతిలో పెట్టి అలాగే చెయ్యమన్నాడు.

'మరి నేను పందెంలో ఓడిపోతానుగదా!' పోతురాజు మరలా నవ్వుతూ అన్నాడు.

'అయిదు వందలు ఎటు తిరిగి ఇస్తున్నాం గదయ్యా—మరో రెండొంద లిస్తాం. మా ముఖాలు చూసి అయినా వాడిని విడిచి పెట్టు' అన్నారు.

'వూరులో నా ప్రతిష్ఠ దెబ్బ తింటుంది. అది ఆలోచించటంలా మీరు.' పోతురాజు శూన్యంలోకి చూస్తూ అన్నాడు.

'ఏమీ దెబ్బ తినదు. వాడికి దెయ్యం మెందుకని కనపడలేదో, మీ రెందుకని వాడికి చూపించలేదో, మేము మిమ్మల్ని ఎలా బ్రతిమలాడుకున్నామో వూరు మొత్తానికీ చెప్తాం.' సుబ్బారావు రెండో అన్న పోతురాజు చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు. పోతురాజు ముఖం విప్పారింది.

'ఒక చిన్న దెయ్యాన్నయినా చూపించి వదలాలని ఉంది.'

'ఎలాగైనా చూపించండి. కొత్త కాపురం. ఏడాదికూడా తిరగలేదు. వాళ్ళ దెయ్యాల పాలు చెయ్యొద్దని బ్రతిమిలాడుకుంటున్నాం.' సుబ్బారావు మూడో అన్న మాట్లాడాడు.

మీసాలు సరిచేస్తూ పోతురాజు 'సరే' నన్నాడు.

అమావాస్య రోజు వచ్చింది.

పగలు పన్నెండు గంటలకు అరుగుల చెట్టు దగ్గర జనం మూగారు. సుబ్బారావు పదకొండు గంటలకే అక్కడికి వచ్చి కూర్చున్నాడు.

పోతురాజు ఏదో మూట చేత్తో పట్టుకుని పన్నెండు దాటాక వచ్చాడు. జనం పోతురాజు వంక కాస్త భయంగానూ, ఎక్కువ ఆసక్తిగానూ చూడటం మొదలెట్టారు.

శ్రీరాములూ, ఇంకా వూరిలోని పెద్దలూ, సుబ్బారావు అన్నలూ అంతా వచ్చి కూర్చున్నారు.

పోతురాజు వెనక ఫకీరు కూడా వచ్చాడు. ఫకీరు పోతురాజుకి అంతరంగికుడు. వాడి చంకలో ఈతాకులతో అల్లిన చాప ఉంది. ఒక చేతిలో కాగితం పొట్లా లున్నాయి.

ఫకీరు నలుగురి ఎదుటా చాప పరిచాడు. పోతురాజు ఆ చాప మీద తన చేతిలో ఉన్న మూటను ఉంచాడు.

ఎర్రబడ్డ కళ్ళతో జనం వైపు, సుబ్బారావు వైపు చూశాడు. తర్వాత శ్రీరాములు గారివైపు చూశాడు.

'ముగ్గులోకి దిగుతున్నా— దిగమంటారా?' అన్నాడు.

'దిగు, దిగు. సుబ్బారావు రెడీగానే ఉన్నాడు.' శ్రీరాములు అన్నాడు.

చాప మీద ఉన్న మూటను విప్పాడు. దాన్ని చూడగానే జనానికి ఒళ్ళు కాస్త గగుర్పొడిచింది. అది మనిషి పుర్రె. కుంకుమా, పసుపూ ప్రాసి ఉంది.

పుర్రె ముందు పెట్టుకుని, ఆ చాప మీద బాసింపట్టుగా కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాడు. వెంటనే ఫకీరు ఆ చాప మీద పసుపూ, కుంకుమా చేతిలో ఉన్న పొట్లాలు విప్పి చల్లాడు. ఆ చల్లిన పసుపూ, కుంకుమ మీద అర్థం కాని గీతలేవో పోతురాజు పుర్రె చుట్టూ గీశాడు. ''ఓం— హ్రీం— హ్రాం' అంటూ కేకలు పెట్టాడు.

ఇంతలో ఫకీరు 'కేర్, కేర్' మంటూ అరుస్తూ ముందుకూ, వెనక్కూ వూగటం మొదలెట్టాడు.

జనం వాడివంక ఆసక్తిగా, ఆశ్చర్యంగా చూడటం మొదలెట్టారు. అలా వూగే ఫకీరు నెత్తిన మనిషి పుర్రె నుంచి పోతురాజు అరిచాడు.



'ఓం— కాపాలికా, చెప్పు. ఎప్పుడు సుబ్బారావుకి దెయ్యాన్ని చూపిస్తావ్?'

ఫకీరుగాడు నిదానించి చెప్పటం మొదలెట్టాడు.

'సుబ్బారావుకి దెయ్యం కనపడాలంటే...'

'ఆఁ—చెప్పు — కనపడాలి.'

'ఈరోజు అర్ధరాత్రి ఈ పుర్రెను తీసుకుని మనవూరి వల్లకాడులో మధ్య ఉన్న రావి చెట్టుకు పైన ఏ కొమ్మకైనా కట్టి కిందకు దిగాలి. చుట్టూ చూడాలి. అలా వారం గనుక చేస్తే తప్పక దెయ్యాన్ని చూపిస్తాను.'

ఫకీరు వణకటం మానేసి, పుర్రెను నెత్తిమీద నుంచి దించుకున్నాడు.

వీళ్ళిద్దరాడే నాటకానికి సుబ్బారావుకి నవ్వు వచ్చింది. కానీ వారం రోజుల వ్యవధి అనేసరికి కొంచెం చికాకు వేసింది. ఏది ఏమైనా, రంగంలోకి దిగాక వెనుకాడ కూడ దనుకున్నాడు. వారం రోజుల శ్రమకు ఐదొందల రూపాయలు ఎందుకు కాదనాలని నిర్ణయించుకున్నాడు.

పోతురాజు మీసాల్ని సవరించుకుంటూ జనం మధ్యలోకి వచ్చాడు. సాక్ష్యంగా ఉండే నలుగురు పెద్దలు కావాలన్నాడు.

శ్రీరాముల్ని, సుబ్బారావు పెద్ద అన్ననీ, పంచాయతీ గుమాస్తా అంకాల్ని, ఆ వూరి ఎలిమెంటరీ స్కూలు పంతులు గారినీ ఎన్నుకున్నారు.

వారు పోతురాజు దగ్గరకు వచ్చి విషయం వివరించమన్నారు.

పోతురాజు చెప్పుకు పోయేడు:

'ప్రతిరోజూ సుబ్బారావు పుర్రెను తీసుకుపోయి రావి చెట్టుకు కట్టాలి. మరలా ఇదే వారంనాటికి దెయ్యం సుబ్బారావుకు కనిపించి భయపెడుతుంది. సుబ్బారావు చూశానని అంగీకరిస్తాడు. అలా అంగీకరించని పక్షంలో దెయ్యం విజృంభించి సుబ్బారావు నేమయినా చెయ్యటానికి అవకాశం ఉంటుంది.'

ఈ లోగా జనం లోంచి ఎవరో కేక వేశారు.

'ప్రతిరోజు మనిషి పుర్రెను రావి చెట్టుకు కట్టి వచ్చినట్టు మీకు రుజువేమిటి?'

'అందుకే ఈ నలుగురు పెద్ద మనుష్యులనీ సాక్ష్యం. పుర్రెను చెట్టుకు కట్టి సుబ్బారావు ఒంటి గంట తరవాత ఇదే అరుగుల చెట్టు దగ్గర కనిపించాలి. అప్పుడు మేం శ్మశానానికి పోయి రుజువు చూసుకు వస్తాము. ఏ రోజు పుర్రె రావిచెట్టు మీద లేకున్నా, పందెంలో సుబ్బారావు ఓడిపోయి నట్లే.' పోతురాజు చెప్పాడు.

ఎలిమెంటరీ స్కూలు పంతులు గారు దానికి కొంత అయిష్టతను వ్యక్తం చేశారు. ప్రతిరోజూ రెండు గంటల దాకా నిద్ర లేకుండా ఉండటం—మరలా ఏడు గంటలకు బడికి పోవటం—ఒక వారం పాటు తనకు సాధ్యం కాదనీ, తన స్థానంలో ఎవరినైనా మరో పెద్దని వేసుకోండనీ శ్రీరాములుగారి తోనూ, ఇంకా జనంతోనూ చెప్పాడు.

జనంలోంచి ఎవరో అన్నారు:

'నిజమే. మన పంచే ఇప్పుడు పనులు లేని రోజులు—పగలు నిద్ర పోయినా పోతాం. పంతులు

## ఒక రోజున నా ఆత్మ

ఒక రోజున నా ఆత్మకు ఒళ్ళు మండింది.
 చెవుల్లో పిచ్చిగా అరిచేసింది.
కునగుడ్లవ చించేయాలని చూసింది
ఎన్నాళ్ళీ పంజరంలో ఇరికిరికి ఉండాలని
మెడడు అదిరేటట్టు అడిగేసింది.
పిచ్చిది గానీ నాకు దానితో పనేమిటి?
నవ్వే మనసుంది నడిపించే మెదడుంది
తిన్నది సుష్ఠుగా అరుగుతున్నది.
అనుకున్నది నిష్ఠగా జరుగుతున్నది
అభ్యుదయం పునాదిమీద వ్యక్తిత్వం
అంచెలంచెలుగా పెరుగుతున్నది.
అందరూ ఆత్మ ఆత్మ అంటూ ఉంటే
ఉందేమో పోనీ అనుకున్నాను
పెట్టె అడుగున దాచిన పెళ్ళినాటి
పట్టుపంచెలా చూసుకున్నాను
ఆత్మ చూపిన వెకిలితనానికి అసహ్యం వేసి
ఆ క్షణమే వెళ్ళిపొమ్మన్నాను.
వెళ్ళిపోయింది ఆత్మ వ్వసౌదిలేసి
పెట్టె ఖాళీ అయిన ఆ అనుభూతి మిగిలించేసి
గడ్డం మాసిన ముఖంలా, బొప్పికట్టిన తలలా
దైన్యాన్ని రాల్చుకుంటూ తిరిగొచ్చిందది
తూష్ణ్యాన్ని చూపుల్తో తోల్చుకుంటూ.
అర్థమయింది విషయం, అంతటా విరిగిన ఆశే
ఏ ఒంటిలోనూ ఇమడలేని పరువు మొండికేసే
సరే అన్నాను — ఒళ్ళంతా జాలి ఉన్నవాణ్నే కదా!
పడుకోబెట్టాను బెట్టెలో పట్టు పంచె మడత కింద.

**- డా॥ సి. నారాయణరెడ్డి**

గారికి అది సాధ్యం కాదేమో!'

శ్రీరాములు గారు 'ఏమయ్యా, పోతురాజూ, పందెం మరో విధంగా ఏం ఉండదా? వారం రోజుల పాటు మాతో మనుష్యుల్ని నిద్ర లేకుండా చంపే స్తున్నారు. గదా?' అన్నాడు.

'దెయ్యం కనపడాలంటే అంతకంటే మార్గం లేదు.' పోతురాజు గట్టిగా అన్నాడు.

'దెయ్యాన్ని చూడటానికి ఇంత తతంగం కావాల్సి ఉంటే ఇంకా జనానికి భయమెందుకు? ఎవరికైనా ఇలా పుర్రెను వారం రోజులూ చెట్టుకు కట్టేసి వస్తేనేగా కనిపించేది?' శ్రీరాములు నవ్వుతూ అన్నాడు. దానికి జనం నవ్వారు.

ఆలా జనం నవ్వేసరికి పోతురాజు అహం దెబ్బ తింది.

'దెయ్యం పూర్తిగా తన రూపంలో కనపడాలంటే అదే మార్గమండీ! విడిగా అయితే అది రకరకాల సమయాల్లో రకరకాల రూపాల్లో కనిపిస్తుంది' అంటూ చెప్పాడు.

'చూపించే వాడివి నువ్వు; చూసేది వాడు. మధ్య మా కొచ్చిందిగదా మాతో పాటు తిప్పలు. సరే, పంతులుగారూ. మీరు తొలగండి. ఒరే, రాజాలూ. నువ్వు రా' అండూ అక్కడ నిలబడ్డ రాజయ్యను కేక వేశాడు.

ఆ గ్రామంలో రాజయ్య మధ్య రకం రైతు. ఎవరినీ ఒక మాట అనటంగానీ, అనిపించుకోవటంగానీ ఎరుగడు. శ్రీరాముల కంటే వయసులో చిన్నవాడు. రాజయ్య అంగీకరించటంతో పందెం కొనసాగటానికి ఇక ఎలాంటి ఇబ్బందులూ లేవన్న అభిప్రాయం బలపడింది.

*  *  *

రాత్రి పదకొండు గంటలకు ఆ వూరిలో చాలా మంది అరుగుల చెట్టు దగ్గరకు వచ్చారు.

పోతురాజు యథా ప్రకారం చాప పరుచుకుని, మనిషి పుర్రెను ముందు పెట్టుకుని ఎవరికీ అర్థం కాని వాగు డేదో పెద్దగా వాగేస్తున్నాడు.

సుబ్బారావు ముళ్ళు గుచ్చుకుంటాయన్న భయంతో కాలికి బూట్లేసుకుని వచ్చాడు.

నిర్ణయించిన నలుగురు పెద్దలు కూడా వచ్చారు. పన్నెండు గంట అయింది. పోతురాజు మనిషి పుర్రెను పొడవుగా ఉన్న ఉత్తరీయంలో మూట గట్టాడు. దాని మీద పసుపు గీతలూ, కుంకుమ బొట్లూ పెట్టాడు.

'కాపాలీ... కనపడేట్టు చెయ్. చెట్టు దగ్గర దెయ్యాన్ని ఉంచు. వోం — హ్రీం — హ్రూం, ముందుకూ వెనక్కూ వూగుతూ అరిచాడు.

మూటను సుబ్బారావు చేతి కిచ్చాడు. దాన్ని సుబ్బారావు తీసుకొనేప్పుడు జనం భయపడ్డారు. సుబ్బారావు మాత్రం నవ్వుతూ దాన్ని తీసుకున్నాడు.

జనంలోంచి మూటను ఎడమ చేత్తో పట్టుకుని సుబ్బారావు చకచకా నడిచి పోయాడు.

'ఈ చీకట్లో సుబ్బారావు శ్మశానాని కెల్తాడు కాబోలు.' జనం చాలా మంది మనసుల్లో అను కున్నారు.

అక్కడ గుమిగూడిన జనానికి తన ప్రజ్ఞ ఎంత గొప్పదో, తానెంత కృషిచేసి దెయ్యాల మీద ఆధిపత్యం వహించాడో, కపాల శక్తి ఎంత గొప్పదో చెప్పుకుపోతున్నాడు. జనం బెరుకు బెరుకుగా, భయం భయంగా వింటున్నారు. ఇంకొకరినైతే దెయ్యాల్ని వదిలి తనేమయినా చేయగలిగే వాడిననీ, సుబ్బారావు అన్నల ముఖం చూసి ఏదో ఒక చిన్న దెయ్యాన్ని మాత్రం చూపిస్తాననీ, ఇప్పటి వరకూ తనకు ఎదురు ఎవరూ చెప్పలేదనీ, తన కెదురు తిరిగితే తా నూరుకున్నా కపాల శక్తి వూరుకోదనీ— ఇంకా ఏమి టేమిటో చెప్పుకు పోతున్నాడు.

ఈలోగా సుబ్బారావు నవ్వుతూ అక్కడికి వచ్చాడు. రావి చెట్టుకు చిటారు కొమ్మ దాకా ఎక్కి కపాలం ఉన్న మూటను కట్టి వచ్చాననీ, వెళ్ళి చూసుకోవలసిందనీ చెప్పాడు. జనమంతా ఆశ్చర్య పోయారు. పోతురాజు నోటి వెంట కాసేపు మాటలు రాలేదు.

శ్రీరాములు పోతురాజు నుద్దేశించి— 'ఏమిటీ, వెళ్ళి చూద్దామా?' అంటూ అడిగాడు.

'చూద్దాం' అని తనలో అందరికీ వినపడేట్టు అనుకున్నాడు.

'అయితే పిల్ల దెయ్యం దొరకలేదన్న మాట.'

'అంటే...' శ్రీరాములు ప్రశ్నించాడు.

'కపాల శక్తి నాకు మొన్ననే చెప్పింది, పిల్ల దెయ్యాన్ని చూపించాలంటే రెండు మూడు రోజులు పడుతుందని, పోతురా జన్న ఆ మాటలకు సుబ్బారావు అందుకొని 'పిల్ల దెయ్య మెందుకయ్యా, నాకు పెద్ద దెయ్యాన్నే చూపించు' అన్నాడు.

సుబ్బారావు అన్నలు కల్పించుకొని 'నోరు ముయ్యరా! ఆయన దేన్ని చూపిస్తే దాన్నే చూసి రా! ఇంకా వారం గడువు ఉందిగా, అన్నారు.

సుబ్బారావు ఎగతాళిగా నవ్వాడు.

పోతురాజుకు కోపం వచ్చింది. ఆ చీకట్లో ఎవ్వరికీ కనిపించకుండా వచ్చిన కోపాన్ని గుటకలుగా క్రిందకు మ్రింగాడు.

'చూద్దాం, పదండి.' పెద్ద మనుషుల వైపు తిరిగి అన్నాడు.

పెద్ద మనుషుల దగ్గర రెండు టార్చిలైట్లు ఉన్నాయి. పకీరు చేతిలో హరికేన్ లాంతరు ఉంది. ఆరుగురూ కలిసి శ్మశానం కేసి నడిచి పోయారు. అక్కడున్న జనానికి సుబ్బారావు తనకు తోచింది చెప్పటం మొదలెట్టాడు.

"ఈ దయ్యా లనేవి కేవలం బూటకం. పని చెయ్యకుండా బతకటానికి వీళ్ళ కిదొక మార్గం.

అసలు నేను ఒకటి అడుగుతాను, చెప్పండి—ఒక కుటుంబ ముందనుకోండి. దాని బాధ్యత ఎవరు తీసుకుంటారు?'

'కుటుంబ యజమాని.' జనంలోంచి ఎవరో అన్నారు.

'అవునా? ఆ కుటుంబం యోగ క్షేమాలూ, మంచీ చెడులూ ఆయనే వహిస్తాడు. ఎందుకంటే, ఆ కుటుంబాన్ని సృష్టి చేసింది ఆయనే కనక. నా విషయ మలా ఉంచండి. అతీతమైన శక్తి ఒకటి మనకు కనిపించకుండా ఉంటుం దనేది నేను నమ్మను. మీరు చాలా మంది భగవంతుని నమ్ముతారు కదా? భగవంతుడే ఈ మొత్తాన్ని సృష్టిస్తే ఆయనే ఇక్కడి మనుషుల యోగ క్షేమాల్ని గురించిన జాగ్రత్త తీసుకోవాలి. ఆయన ఇక్కడ ఉన్న సకల చరాచరరాశికి సృష్టికర్త, తండ్రి లాంటి వాడూను కనక. మరి అలాంటి ఉన్నతమైన శక్తి ఈ దెయ్యాల్ని సృష్టి చేసి మన జీవితాల్ని వాటి పరం చేస్తుందంటే మీకు నమ్మకం కలుగుతుందా? దెయ్యాన్ని నమ్మే మీరు భగవంతుణ్ణి కూడా ఎలా నమ్ముతారో నాకు అర్థం కాకుండా ఉంది.'

ఆ మాటలు సుబ్బారావు పూర్తి చెయ్యగానే—'నిజమే. దేవుడు దెయ్యాన్ని పుట్టించి ఉండడు?' అని జనం లోంచి ఎవరో అన్నారు:

మరలా జనం లోంచి ఎవరో అన్నారు.

'ఇదంతా అనవసరం, అబ్బాయ్ వారం గడిచిన తరవాత మాకు నువ్వు చెప్పు. ఏదైనా వింటాం. పోతురాజా వోడిపోయి శ్రీరాములు దగ్గరున్న వెయ్యి రూపాయలూ నీ చేతి కొచ్చినాడు, నిజంగానే దెయ్యాలు లేవని నమ్ముతాం.'

అక్కడి జనమంతా ఆ మాటలకు నవ్వారు. సుబ్బారావు కూడా నవ్వాడు.

'నిజంగా దెయ్యం నాకు కనిపించి నా కళ్ళ ముందు మాయ మవ్వాలే కాని, పోతురాజు ఎంత గొప్పవాడో మీ కంటే ముందు ఇక్కడ జనానికి నేనే ప్రచారం చేస్తా. ఆయనకు శిష్యుడుగా మారిపోయి ఆజన్మాంతం ఆయన దగ్గరే ఉండి పోతా.' సుబ్బారావు అన్నాడు.

ఆ సమయంలో ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకోవటం మొదలు పెట్టారు.

కొద్దిసేపు గడవగానే శ్రీరాములు అక్కడికి వచ్చాడు.

పోతురాజూ, పెద్ద మనుషులూ ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళి పోయారనీ, రావి చెట్టుకు పుర్రె కట్టబడి ఉందనీ, దాన్ని పకీరు పూజదీశాడనీ, సుబ్బారావు మొత్తానికి ధైర్యవంతుడు లాగానే ఉన్నాడనీ, ఏదైనా వారం గడిస్తేనే కాని ఏదీ చెప్పటానికి వీలు లేదనీ, ఎవరి ఇళ్ళకు వారు పొండనీ చెప్పి వెళ్ళిపోయాడు.

కొందరు సుబ్బారావును పొగిడారు. మరి కొందరు వారం గడవా అన్నారు.

కాసేపట్లో, అప్పటికే కాలాతీతం కావటంతో ఎవరి దారిన వారు పోయారు.

* * *

నాలుగో రోజు రాత్రి.

ఆకాశం మేఘావృతమయింది. ఎక్కడో దూరంగా మెరుస్తోంది. మరి కాస్సేపట్లో వర్షం వస్తుందా అన్నట్టు అందరికీ ఉక్క బోస్తోంది. ఎక్కడా గాలి లేదు.

సుబ్బారావు యథా ప్రకారం పదకొండు గంటలకే వచ్చి కూర్చున్నాడు. అంతకు ముందే పోతురాజు అక్కడ చాప పరుచుకుని, కపాలాన్ని ముందు పెట్టుకుని ఎవరికీ అర్థం కాని వాగు డేదో వాగుతున్నాడు.

జనం పెద్దగా ఆ రోజు రాలేదు.

ఎవరికి తప్పినా తమకు తప్ప దన్నట్లు పెద్ద మనుషులు వచ్చారు. వర్షాన్ని ఊహిస్తూ వారు భయపడ్డారు.

శ్రీరాములు పోతురాజు దగ్గర కొచ్చి —'త్వరగా ఆ పుర్రె మాట ఇస్తే వాడు కట్టే వస్తాడు. వర్షం వచ్చేట్టు ఉంది' అన్నాడు.

కపాల శక్తి కాలము అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటాలనీ, అంతకు ముందు ఇవ్వటం జరుగకూడదనీ పోతురాజు గట్టిగా చెప్పాడు.

ఆ మాటలు విన్నాక శ్రీరాములుకి కోపం వచ్చింది. పెద్దమనిషిగా ఒక నిర్ణయానికి కట్టుబడ్డాక బయట పడటం మంచిది కాదని తమాయించుకున్నాడు.

పన్నెండు గంట లయ్యింది.

సుబ్బారావు పోతురాజు చేతిలో నుండి కపాలాన్ని తీసుకుని బయలుదేరాడు.

అసలే చీకటి. అందులో ఆకాశం నిండా నల్లని మబ్బులు. చుక్కల వెలుగుకూడా కనిపించటం లేదు. దూరంగా మెరిసే మెరుపు ఇస్తున్న వెలుగు తప్ప కన్ను పొడుచుకున్నా దారి కనిపించటం లేదు.



ముగ్ధ

చిత్రం — ఎస్. ఆర్. పాంచెం

అయినప్పటికీ అలవాటు ప్రకారం డొంకలూ దారులూ దాటి శ్మశానం చేరాడు.

ఆ చీకట్లో నెత్తిమీద ఏదో మోపు లాంటిది పెట్టుకుని ఎవరో సుబ్బారావుకి ఎదురు పడ్డారు.

'ఎవరూ' అంటూ పలకరించాడు. ఆ వ్యక్తి పలక్కుండా త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ దాటి పోయాడు. సుబ్బారావు పట్టించుకో లేదు. పట్టించుకునే వ్యవధికూడా లేదు.

అప్పటికే వర్షం చినుకులు మెల్లిగా సాగాయి.

రావి చెట్టుకు దగ్గర్లో ఏదో శవం కాలుతూ ఉంది. సుబ్బారావుకి ఆశ్చర్యం వేసింది. ఊరిలో ఎవరు చనిపోయినా ఊరు మొత్తానికి తెలుస్తుంది.

ఎవరు చనిపోయారో అతని ఊహకు అందలేదు. తమ గ్రామానికి కాస్తంత దూరంలో ఒక పాతిక ఇళ్ళు ఉన్నాయి. ఒకవేళ అక్క డెవరైనా చనిపోయారేమో ననుకున్నాడు. వారికీ ఇదే శ్మశానం.

అక్కడ ఉండే ఏడుకొండలు ఒకనాడు అరుగుల చెట్టు దగ్గర తనకు చెప్పిన సంగతులూ, తమ అప్పుడిచ్చిన సలహాలు సుబ్బారావు మనసులో లీలగా మెదిలాయి.

ఆమె కాదు కదా?

ఏడుకొండలు ఉత్త అమాయకుడు. భార్యకు హిస్టీరియా తెరలు వస్తే ఆసుపత్రులకు తీసుకు పోలేదు. ఆమె అరిచే వింత అరుపులకు దెయ్యమని భయపడ్డాడు. పోతురాజును తీసుకుపోయాడు.

ఈ పోతురాజుకి ఇలాంటి కేసులు అయిదారుంటే

చాలు, కొబ్బరి చిప్పలూ, కోడి మాంసమూ, చేతి నిండా పైకమూ—ప్రతి రోజూ పండగే.

రెండు సంవత్సరాల నుంచి వైద్యం చేస్తున్నాడనీ, ఏమీ తగ్గ లేదనీ ఆ రోజు చెప్పాడు.

ఆలస్యం చెయ్యకుండా ఎక్కడికయినా ఆసుపత్రికి తీసుకు పొమ్మని తాను సలహా ఇవ్వడం జరిగింది.

మనిషికి ఈమధ్య తెరలు మరీ ఎక్కువగా వస్తున్నాయనీ, అప్పుడప్పుడు నోటి నుండి నురగ కూడా వస్తూందనీ, తనకు భయంగా ఉందనీ, తగ్గే ముందు ఇలాగే వ్యాధి ముదిరి, దెయ్యం ప్రకోపిస్తుందనీ, భయపడ వద్దని, పోతురాజు చెబుతున్నాడని ఏడు కొండలు చెప్పాడు.

అతని పరిస్థితికి ఏడవాలో, నవ్వాలో అర్థం కాలేదు తనకు. ఈ గ్రామంలోని అమాయకత్వాన్ని పోతురాజు ఎలా వాడుకుంటున్నదీ చక్కగా అర్థమయింది.

ఇప్పటికి సమయం దొరికింది. దెయ్యాన్ని ఎలా చూపిస్తాడో తెలుస్తుంది.

సుబ్బారావు అలా అనుకుంటూ చెట్టు దగ్గరకు పోయాడు. కాలుతున్న 'కాడు' కు కాస్తంత దూరంలో అది స్త్రీ శవం అనటానికి ఋజువుగా పాత చీర ఒకటి పడి ఉంది.

తనకు ఎదురు వచ్చింది బహుశా గ్రామ వెట్టి అయి ఉంటాడు. కట్టెల మోపుతో వెళ్ళుతున్నాడన్న మాట. కాటికి పేర్చాల్సినవి కాసిని ఎక్కడో దొంగతనంగా దాచుకుని ఇప్పుడు తీసుకెళ్ళుతున్నాడు.

అప్పటి కింకా శవం పూర్తిగా కాలలేదు. కపాల మోక్షం కాకుండానే జనం వర్షానికి భయపడి కదిలిపోయినట్లున్నారు.

సుబ్బారావు రావిచెట్టు ఎక్కి ఒక కొమ్మకు మూటను కట్టి క్రిందకు దిగాడు.

వర్షం జోరు హెచ్చింది!

తను పందెం సంగతి ఎలా ఉన్నా, పెద్ద మనుషుల నీ వర్షంలో ఇబ్బంది పెట్టవలసి వచ్చిందే అనుకుంటూ వేగంగా నడవటం మొదలెట్టాడు!

■ ■ ■

సుబ్బారావు అరుగుల చెట్టు దగ్గరికి చేరే సరికి పకీరుగాడు, పోతురాజు, పెద్ద మనుషులూ తప్ప ఎవరూ లేరు. అందరికీ గొడుగు లున్నాయి!

పకీరుగాడి చేతిలోనూ, శ్రీరాములు గారి చేతిలోనూ, రాజయ్య గారి చేతిలోనూ టార్చిలైట్లు ఉన్నాయి. సుబ్బారావు వస్తుంటే వా రా లైట్లు వేసి చూశారు. మూడు లైట్లూ గుడ్డిగానే వెలుగుతున్నాయి. బాటరీ సెల్స్ లోని శక్తి సన్నగిల్లినట్లు ఉంది!

సుబ్బారావు దగ్గరికి రాగానే శ్రీరాములు గా రిలా అన్నారు:

'ఏరా, సుబ్బారావ్! నీకు దెయ్యమెప్పుడు కనిపిస్తుందో, మా కీ తిప్ప లెప్పుడు తప్పుతాయో! ఇంతకూ బుద్ధి తక్కువ మాదిరా!'' దానికి తక్కిన పెద్ద మనుషులు నవ్వారు. సుబ్బారావు కూడా ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు. పోతురాజుకు అంతరంగం ఉడికిపోయింది.

సుబ్బారావు ఇంతకు తెగిస్తాడనుకోలేదు. భయపడి పారిపోతా డనుకున్నాడు. వారం రోజులు అర్ధ రాత్రి శ్మశానానికి పోవటమంటే ఎవరైనా భయపడతారనుకున్నాడు. నిద్రలేమి మీద నీరసించి ఏ జ్వరమో వచ్చి కలవరించక పోతాడా అనుకున్నాడు.

అలాంటి దేమీ సుబ్బారావులో కనపడక పోగా! నీరసం తనకే వస్తూందని పోతురాజు గ్రహించాడు. ఇక మూడు రోజులు మాత్రమే ఉంది. సుబ్బారావు ఈ మూడు రోజులు కూడా ఉత్సాహంగా పని ముగిస్తాడు. దెయ్యాల భయం సుబ్బారావుకు ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు.

దెయ్యాన్ని చూపించ లేదంటే సుబ్బారావు అన్నలు పోయిన డబ్బు ఇస్తారు. మరి దిగజారుతున్న ప్రతిష్ఠ!

సుబ్బారావు, అన్నలు ఏం చెప్పినా జనం నమ్మరు. అనవసరంగా తా నీ అర్థం లేని పందెంలో చిక్కుకుని లేనిపోని అప్రతిష్ఠ తెచ్చుకుంటున్నానను కుని తలపోశాడు. ఏ పకీరు గాడికో దెయ్యం వేషం వేయించి శ్మశానంలో నాటకం వేయిద్దామను కుంటే, సుబ్బారావు వాలకం చూస్తే కలబడి బాదేట్టు కనిపిస్తున్నాడు. తీరా విషయం బయట పడితే ఉన్న పరువు కాస్తా దిగజారిపోతుంది. దెయ్యం అంటే వేషం వేసిన పకీరుగాడా అని జనం తనను మరేదయినా చెయ్యటానికి అవకాశం ఉంది.

పోతురాజు ఆలోచిస్తూ నిలబడ్డాడు.

ఆ చీకట్లో అలాగే నిలబడ్డ పోతురాజుకేసి—'వర్షం వెలిసేదాకా ఆగుదామా?' అంటూ రాజయ్యగా రన్నారు.

'వర్షం ఇప్పట్లో ఆగదు. అందరం గొడుగులు తెప్పించాంగా—పదండి' అన్నాడు శ్రీరాములు.

సుబ్బారావును అక్కడ వదలి వారంతా కదిలి పోయారు.

* * *

శ్మశానం చేరే సరికి వర్షం కొద్దిగా వెలిసినట్లు వారికి అనిపించింది. చేతుల్లో మూడు లైట్లు ఉన్నప్పటికీ. ఒకటీ సరిగా వెలగటం లేదు.

వర్షం ఉధృతం తగ్గినా, ఉరుములూ, మెరుపులు అలాగే ఉన్నాయి.

చెట్టుకు కాస్త దూరంగా అంతా నేలకేసి చూస్తూ నడుస్తున్నారు.

పోతురాజు తల పైకెత్తి చెట్టువైపు చూశాడు. అదే సమయంలో మెరుపు మెరిసి మాయ మయింది. క్రితం మెరుపు తాలూకు ఉరుము శబ్దం దగ్గరలో పిడుగు పడిందా అన్నంత భయానకంగా వినపడి చెవులు అవెరి పోయాయి.

ఆరిపోయిన 'కాటి' మీద ఎముకల వరకూ కాలిపోయిన శవం పోతురాజుకు వికృతంగా నిగిడి పైకి లేచి, నల్లని శ్మశాన సింహాసనం మీద కూర్చున్న కథల్లోని బేతాళ రాజులా కనిపించిలిది.

అంతే.

---

**తక్కువ కాలంలో ఎక్కువ పుస్తకాలు చదవడం కన్నా, ఎక్కువ వ్యవధిలో తక్కువ పుస్తకాలు అధ్యయనం చేయడం మేలు.**

— హామిల్టన్

---

పోతురాజు ఒక్కసారి కెవ్వున కేక పెట్టి, 'దెయ్యం' అంటూ కింద పడిపోయాడు.

ఈ అనూహ్యమైన హఠాత్పరిణామం ఆ చీకట్లో నడిచే పెద్దలకు కాస్త ఆశ్చర్యమూ, ఎక్కువ భయమూ కలిగించింది.

పకీరుగాడు వెంటనే పోతురాజు ముఖం కేసి లైటు వెలిగించాడు.

'ఏంటి గురుగారూ, ఏంటి గురుగారూ' అంటూ పెద్దగా అరవటం మొదలెట్టాడు.

నలుగురు పెద్దలూ పోతురాజు వంక పరీక్షగా చూశారు. బురద నేల మీద వెల్లకిలా పడిపోయి, అదో రకంగా వణుకుతూ ప్రమాదం ముంచు కొచ్చిన వాడులా కనిపించాడు.

వెంటనే వారు పోతురాజును నాలుగు వైపులా పట్టుకుని, 'ఇదేం కర్మరా బాబూ' అనుకుంటూ పూరుముఖం పట్టారు. అతి కష్టంమీద పోతురాజు భారీ విగ్రహాన్ని ఆయన ఇంటికి చేర్చారు.

పరిస్థితి అర్థం కాక పోతురాజు భార్య ఒకే పెట్టున శోకాలు తీయటం మొదలెట్టింది.

స్పృహ సరిగ్గా లేని స్థితిలో పోతురాజు 'దెయ్యం, దెయ్యం' అంటూ కలవరిస్తున్నాడు. శ్రీరాములుకి తక్కిన వారికీ ఇదేం అర్థం కాలేదు.

* * *

తెల్లవారాకకూడా పోతురాజు పరిస్థితి సరిగ్గా లేకపోయేసరికి పట్నం తీసుకుపోయి ఆసుపత్రిలో చేర్చారు. డాక్టరు ఏవో మందులు వాడితే పోతురాజు పరిస్థితి మెరుగయింది.

రెండు రోజులు గడిచాక మంచం పక్కనే కూర్చున్న పోతురాజు భార్య, భర్తతో — 'ఏమండీ! ఇంతకు ముందు మీరు దెయ్యాల్ని చూడలేదా?' అంటూ అడిగింది. అందుకు పోతురాజు— 'లేదే అసలు అవి ఉన్నాయనుకుంటే ఈ దెయ్యాల వ్యాపారం లోకి దిగేవాడినే కాదు. ఏ చింతపండో, జీలకర్రో అమ్ముకుని బతికే వాడిని' అన్నాడు.

'మరిప్పుడు దెయ్యాల వైద్యం మానుకుంటారా?'

'తప్పకుండా. లేకుంటే దెయ్యాలకి కోపం వచ్చి.' ఆపై పోతురాజు చెప్పలేకపోయాడు. పెదాలు వణికాయి. చెమటలు పోశాయి.

కాస్సేపటికి 'ఈ పూరు వదిలి పెట్టి వెళ్ళిపోదాం' అన్నాడు.

* * *

తరవాత ఆ పూరులో జనమంతా ఒక సందేహంలో పడిపోయారు.

సుబ్బారావుకు కనిపించాల్సిన దెయ్యం, పోతురాజుకుకనపడట మేమిటి, కనపడిందే పో—పోతురాజిలా భయపడి పూరు వదిలి పారిపోవటం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

దెయ్యాలు లేవంటూ సుబ్బారావు మొత్తుకుంటున్నా జనం అదో విధంగా చూస్తూ ఉండిపోయారే తప్ప ధైర్యంగా ఎవరూ వంత పలుకలేకపోయారు.

ఏది ఎలా ఉన్నా పోతురాజు బెడద ఆ గ్రామాలకు వదలటంతో సుబ్బారావు ఒక విధంగా సంతోషించాడు. ★